# మధ్యేమార్గం

ఆదివారం తొమ్మిది గంటలు సమయంలో అకస్మాత్తుగా స్ఫురణకు వచ్చింది దమయంతికి. తమ ఇల్లు - ముఖ్యంగా అతిథులు కూర్చునే హాలు - యేమాత్రం సవ్యంగా లేదని, ఇంకా రెండు గంటలే సమయ విరామం - ఇల్లు సర్దుకున్నా. వంటకు కాలసిన పనులు చూచుకన్నా. దమయంతికి నీరసం తెరలు వంటినిండా కమ్ముకున్నట్లు అయింది. ముందు ఓ కప్పు వేడివేడిగా కాఫీ తాగితే కాని మనస్సు, శరీరం కలిసికట్టుగా పనిచేయవు అనిపించింది. అందుకని తక్షణం ఆ పనిలో యిరుక్కుపోయింది.

అశోక్ ఇంకా నిద్ర లేవలేదు. అతనికి ఆదివారం అని పట్టింపు లేదు - యే రోజు అయినా పది గంటలన్నా కాక ముందు నిద్ర లేవడం అతనికి చికాకు. రాత్రి పన్నెండు, ఒంటిగంట వరకు యేదో పుస్తకం చదువుతూనో, టి.వి. చూస్తూనో కాలక్షేపం చేస్తాడు. దమయంతి అయిదు గంటలు కాకుండానే నిద్రలేచి, తన పనులన్నీ పూర్తి చేసుకుని భోజనం తయారుచేసి, అతనికి కావలసినవన్నీ డైనింగ్ టేబుల్ మీద తీరుగా సర్దిపెట్టి తలుపు వేసుకోవటానికి మాత్రం అతన్ని లేపుతుంది. తొమ్మిదిన్నరకు. అప్పటికే అతనికి చిరాగ్గా వున్నప్పుడు 'నీవు డోర్ లాక్ వేసుకుని వెళ్ళిపోవచ్చునుగా. బంగారంలాంటి నా నిద్ర ఎందుకు పాడు చేస్తావు?' అని సణుగుతూ వుంటాడు. అయినా నిద్రలేపి స్వయంగా 'నేను ఆఫీసుకు వెడుతున్నాను. మీరు యేదయినా పనిమీద బయటకు వెళ్లినా సాయంత్రం ఆరు గంటలకు కాకుండానే యింటికి వచ్చేయండి' అని చెప్పితే తప్ప దమయంతికి తృప్తిగా వుండదు.

దమయంతి ఈ రోజే సువర్చలను భోజనానికి పిలిచింది. వాళ్ళిద్దరూ ఒకే ఆఫీసులో ఎగ్జిక్యూటివ్స్. దమయంతి ఎకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన మనిషి అయితే, సువచ్చల జనరల్ మేనేజ్‌మెంట్ వనిత. ఇద్దరూ ఒకే ఇనిస్టిట్యూట్ నుంచి ఎం.బి.ఎ. చేశారు. ఉద్యోగం కూడా ఒకే కంపెనీలో దొరికినప్పుడు వాళ్ళ స్నేహం మరింత బలపడింది.

ఇద్దరూ మధ్యాహ్నం పూట కలిసి భోం చేస్తారు. ఒక్కొరోజు దమయంతి ఛేంబర్స్‌లో

అయితే మరో రోజు సువర్చల ఛేంబర్స్‌లో. ఇద్దరికీ వినుగ్గా వున్నఅడు దగ్గర్లోనే వున్న రెస్టారెంట్‌కు వెళ్ళి తీరుబడిగా నడక సాగిస్తారు.

సువర్చల తరచుగా - అంటే రెండు నెలలకు ఒక్క మారన్నా - దమయంతిని తమ ఇంటికి ఆహ్వానిస్తూ వుంటుంది - భర్తతో సహా భోజనానికి రమ్మని. భర్తకు అలా భోజనాలకు వెళ్ళేంత తీరుబాటు లేదని దమయంతి ప్రతిమారూ యేదో ఒక 'ఎక్స్‌క్యూజ్' చెప్పి తప్పించుకుని, ఒక్కత్తే వెడుతూ వుండేది. అలా అయిదారుమార్లు అయిన తరువాత, దమయంతికి అనిపించింది - తాను ఒక్కమారన్నా సువర్చలను, ఆమె భర్తను భోజనానికి ఆహ్వానించకపోతే బాగుండదని. అనగా అనగా ఈరోజున ముహూర్తం కుదిరింది. అయితే యేం లాభం? సువర్చల భర్త అర్జెంటుగా ఆ క్రితం రోజే మరో పట్టణానికి వెళ్ళవలసి వచ్చింది. ఆఫీసు పనిమీద. 'నీ గాలే నాకూ సోకినట్లయింది నేను ఒక్కదాన్నే పదకొండు గంటలకు వస్తున్నాను. చాలా? మూఁడు గంటల రకూ కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ కూర్చుందాం - మీ ఆయన్ని మటుకు యింటికే కట్టిపడెయ్యి. ఏదో నెపం వెదక్కు - దాచి వేయటానికి!' అంది సువర్చల.

అబద్ధాలు ఆనందంగా వుండడం అంటే యిదే అనిపించింది దమయంతికి. తానేమీ కావాలని 'అశోక్'ను యితరులకు పరిచయం చేయకుండా దాచి వుంచడం లేదు. అతని 'బద్ధకం' వల్ల ఎప్పుడూ మెళకువగా వుంటాడు. ఎప్పుడు ఏ పనిమీద యెక్కడికి వెళ్ళిపోతాడో తనకే తెలియదు. ముందుగా అనుకోవడం, ఆ అనుకున్న ప్రకారం ఆచరించడం వంటి పనులు అశోక్ మనస్థితికి అతి దూరం అయిన విషయాలు.

దమయంతి కాఫీ తయారుచేయడం అయిపోయింది. రెండు కప్పులు ట్రేలో పెట్టుకుని వెళ్ళింది బెడ్‌రూంలోనికి. అశోక్ శరీరమంతా యింకా దుప్పటి ముసుగులోనే వుంది. ట్రే బల్ల మీద వుంది. దమయంతి సుకుమారంగా అతన్ని తట్టి లేపే ప్రయత్నం చేసింది, అతను మేలుకునే వున్నా!

'ఇవేళ ఆదివారమేగా! మరో గంట యిలాగే పడుక్కుని యేకంగా పదకొండు గంటలకు వస్తాను, భోజనం చేసెయ్యవచ్చు' అన్నాడు అతను రహస్యం చెబుతున్నట్లు దమయంతితో.

'మరిచిపోయారేమిటి? నిన్న చెప్పాను. సువర్చల యివ్వాళ భోజనానికి వస్తుంది. కాస్త ముందు గది, హాలు అయినా 'నీట్'గా వుంచే ప్రయత్నంలో నాకు సహాయపడరూ? వంట పనితో నాకు అలసట అయిపోతుంది గదా!' అంది దమయంతి అతనితో అతి మురిపెంగా.

'నేను పదకొండు గంటలకు తయారయి కూర్చుంటే చాలు కదా! గదులు ఎంత సర్దినా నీట్‌గా వుండవు. సర్దిన కొద్దీ మరింత షాబీగా తయారువతాయి అంటావు గదూ' అన్నాడు అశోక్. మంచం మీద నుంచి కదిలే ప్రయత్నం యేమాత్రం చేయకుండానే.

దమయంతికి తెలుసు, అతన్ని యే 'పరాశక్తీ' కదిలించలేదని. 'సరే, కాఫీ అయినా

తాగి పడుకోండి' అంటూ అతనికి కాఫీ అందించింది.

'అబ్బ, యిప్పుడు వద్దులే - ఫ్లాస్క్‌లో పోసి వుంచు. పది గంటలు అయిన తర్వాత తీసుకుంటాను.'

కాఫీ తాగడానికి కూడా బద్ధకమే యీ పండితుడికి - అనుకుంది దమయంతి.

'పది గంటలకు మళ్ళీ యిస్తాలెండి. ఇప్పుడీ కాఫీ తాగేసి పడుకుందురూ?' అంది.

అవోక్ ఆమెను 'ఒబ్లయిజ్' చేశాడు.

దమయంతి ఖాళీ కప్పులు తీసుకుని బయటకు నడిచింది.

సువర్చల ఆఫీసు పనిలోనే కాదు, యింటి వ్యవహారాలతో కూడా అతి చురుకైన మనిషి. వాళ్ల యింటినీ, ఆ గదులనూ చూడవలసిందేగాని వర్ణించటానికి 'ఆదిశేషువు'కు కూడా అలవి కాదని దమయంతి అభిప్రాయం. అన్నీ ఖచ్చితమైన అభిప్రాయాలు వున్న మనిషి సువర్చల. వాటనన్నిటినీ అమలు చేయడంలో భర్త సహకారం కూడా వుంది. మనకు ఎన్ని మంచి ఆలోచనలు వుంటే మటుకు యేం ప్రయోజనం? మనతో కలిసి పనిచేసేవాళ్ళు కూడా వాటిని మన్నించాలి గదా - అనుకుంటుంది దమయంతి. వాళ్ళు మన్నించేట్లు చూచుకోవడం కూడా మన పనిలో భాగమే అంటుంది సువర్చల. అది ఎట్లా భాగమో, యేం చేస్తే ఈ సమీకరణం చక్కగా అమరి అంతా సమరసంగా కుదుతుందో అర్థం కావడం లేదు ఎకౌంట్స్ ఎగ్జిక్యూటివ్ దమయంతికి.

పదకొండు గంటలకు ఠంచనుగా యింటి ముందు ఆటో ఆగింది. దమయంతి వాకిట్లోకి వెళ్ళింది. సువర్చల డ్రైవర్‌కు డబ్బు యిచ్చి 'డిస్పోజ్ ఆఫ్' చేసి అప్పుడు 'హాయ్' అంది దమయంతిని.

'ఏం స్కూటరు మొరాయించిందా?' అడిగింది దమయంతి.

'ఊహూ.. నేనే మొరాయించాను. ఆదివారం అయినా దానికి సెలవు యివ్వక పోవడం అన్యాయం గదూ! ఫర్ ఎ ఛేంజ్ యివాళ ఆటోలో వద్దాం అనుకున్నాను' అని బదులు చెప్పింది సువర్చల.

బంగారం రంగు చీర కట్టుకుంది ఆమె. చీరె రంగుకు ఒక వన్నె ఎక్కువ కాంతి అయిన బ్లవుజ్ వేసుకుంది. సువర్చలను చూచినప్పుడు దమయంతికి మనసుకు ఎంతో ఆనందం అవుతుంది. మంచి 'ఈస్థటిక్ సెన్స్' వున్న మనిషి. తనతోపాటు, సుందరం - శుభ్రం అయిన వాతావరణాన్ని కూడా పట్టుకు వెడుతూ వుంటుంది ఎక్కడికయినా.

దమయంతి గులాబి రంగు చీర కట్టుకుంది. సువర్చల ముందు తాను 'డార్క్ గర్ల్' అయిపోయినట్లు అనిపించింది ఆమెకు.

ఇద్దరూ ఓ పది నిముషాలపాటు నిన్నంతా యింటి దగ్గర యేమేం పనులు చేసింది మాట్లాడుకున్నారు. తరువాత - యీ వేళ న్యూస్ పేపర్లో వచ్చిన 'మిడ్ - పేజ్ ఆర్టికిల్స్' గురించి, మాగజైన్ సెక్షన్లో వచ్చిన కొత్త విషయాలను గురించి అభిప్రాయాలు ఎక్స్ఛేంజ్

తీసుకున్నారు. ఓ అరగంట గడిచిపోయింది. దమయంతి 'ఏపిటైజర్' తెస్తానంటూ లోపలకు వెళ్ళింది.

ఆమె మూడు గ్లాసులతో ద్రాక్షరసం తీసుకురావడానికి అయిదు నిముషాల ముందే అశోక్ ఆమెను పలుకరించాడు.

'దమయంతి మిమ్మల్ని గురించి చాలా చెప్పింది - ఇప్పుడు కలుసుకోవడం నాకు ఆనందంగా వుంది - నేను అశోక్‌ను. దమయంతి మీకు నన్ను గురించి యెప్పుడయినా చెప్పిందో లేదో - చెప్పినా యేం చెప్పిందో నాకు సుతరామూ తెలియదు' అందామని ప్రయత్నం చేశాడు అశోక్. ఈ మాటలు యేకబిగిని చెప్పడం అతని వల్ల కాలేదు. అందుకని మూడు భాగాలుగా చెప్పగలిగాడు.

సువర్చల సాదరపూర్వకంగా నమస్కారం చేసి, 'నా మాట నమ్మండి, దమయంతి మీ గురించి యేమీ చెప్పలేదు. మేం విపరీతంగా ఎక్కువ సేపు మాట్లాడుకునే మాట నిజమే గాని ఎప్పుడూ మాకు ఆఫీసు విషయాలు, ప్రపంచంలో సంగతులు మటుకే వస్తాయి ప్రస్తావనకు. పర్సనల్ విషయాలు, వివరాలు, స్థితిగతులు చర్చించుకోం' అంది.

'చాలా ఆరోగ్యకరమైన సంగతి' అన్నాడు అశోక్.

ఇంతలో దమయంతి రానే వచ్చింది.

ద్రాక్షరసం చప్పరిస్తూ సువర్చల అశోక్‌ను గమనించనారంభించింది.

అతను గడ్డం గీసుకోలేదు. ముఖం మాత్రం శుభ్రంగా కడుక్కుని 'ఫ్రెష్'గా తయారవటానికి ప్రయత్నం చేశాడు. అతి సాదా కాటన్ షర్ట్ వేసుకున్నాడు. నిగనిగలాడుతున్న పాలియిస్టర్ పాంట్ వేసుకున్నాడు. కళ్ళు యెంతో లోతుగా, ఈ మనిషి ఎప్పుడూ ఆలోచనల్లోనే మునిగి వుంటాడా అన్నంత తీవ్రంగా వున్నాయి. ముఖంలో ఒక రకమైన మార్దవం గోచరిస్తుంది. మాటలు తూచి తూచి ఉపయోగిస్తాడు. తీరుబడిగా కాలం గడిపి వేయటానికి అలవాటుపడ్డ మనిషిలా అతి దిలాసాగా, నిదానంగా వుంటుంది అతని వాలకం. దేన్ని గురించయినా ఆదుర్దా పడడం గానీ ఆందోళన చెందడం గానీ అతని తత్వానికి వ్యతిరేకం - అన్న విషయం సువర్చలకు యిట్టే అర్థమయిపోయింది, వాళ్ళు కలిసి కూర్చున్న అరగంటలోను.

'మీరేం చేస్తూ వుంటారు?' అనడిగింది సువర్చల.

అతను ఆమె వంక చూచి మౌనంగా వుండిపోయాడు. బదులు చెప్పటానికి ప్రయత్నం చేస్తున్నాడో లేక తన ప్రశ్నను ఇగ్నోర్ చేస్తున్నాడో అర్థం కాలేదు ఆమెకు. దమయంతి ఎప్పుడో చెప్పింది అతను 'లా' చేస్తున్నాడని, సాయంత్రం కాలేజీలో.

'ప్రత్యేకంగా యేం చేయను' అన్నాడు కొంతసేపు అయిన తర్వాత, 'నేను సిగరెట్లు తాగను' అని అర్థవంతమైన స్టేట్‌మెంట్ యిస్తున్నట్లుగా. 'కల్చరల్ క్లబ్బులు, కాలేజీలలో ఉపన్యాసాలు యిస్తూ వుంటాను - అదీ అతి అరుదుగానే! - అన్నాడు అశోక్.

సువర్చలకు అతను యేం విషయాలపై ఉపన్యాసాలు యిస్తాడో తెలుసుకోవాలనిపించింది. ముఖ్యంగా ఎగ్జిక్యూటివ్‌లకు స్ట్రెయిన్, స్ట్రెస్ లేకుండా యేమన్నా సూచనలు యివ్వగలిగితే తమ కంపెనీ ఆధ్వర్యంలో ఒకటి రెండుసార్లు యితన్ని 'ఎంగేజ్' చేయటానికి వీలవుతుందని స్ఫురించింది ఆమెకు చప్పున. సరే ఈ విషయం తరువాత దమయంతిని అడిగి తెలుసుకోవచ్చు.

తీరా భోజన సమయానికి అశోక్ 'నాకు అకస్మాత్తుగా ఒక విషయం గుర్తుకు వచ్చింది. దాన్ని వెంటనే నోట్ చేసుకోవాలి. లేకపోతే యిట్టే మరచిపోతాను. నన్ను ఎక్స్‌క్యూజ్ చేయండి' అంటూ తన గదిలోకి వెళ్ళాడు.

దమయంతి సముదాయింపుగా నవ్వింది. 'ఆయన పద్ధతే అంత! ఏ భవభూతి వాక్యమో గుర్తు వస్తుంది. దానికి కొత్త అర్థం స్ఫురిస్తుంది. వెంటనే రికార్డ్ చేసుకోకపోతే మళ్ళీ మరిచిపోతానని. వళ్ళు మరచి నిద్రపోతాననీ భయం. సాయంత్రం నాలుగు గంటలకు టీ సమయానికి నేను లేపితేనే స్పృహ వస్తుంది. లేపకపోతే యేం అవుతుందో నేను యింతవరకు ఎక్స్‌పరిమెంట్ చేసి చూడలేదు' అంది.

సువర్చలకు యిలాంటి సన్నివేశాలు బహు అరుదు - అసలు అలవాటే లేదు, అర్థంకాదు - అనుకున్నా యేమీ ఆశ్చర్యం లేదు.

'మీ పరిచయం కాలేజీలో అయిందా? చదువుకుంటూ వున్నపుపడే మీరు ఒకరినొకరు కలుసుకోవడం జరిగిందా?' అనడిగింది దమయంతిని.

'నాకు మేనమామ కొడుకు. చిన్నప్పటి నుంచి - అంటే, నేను పుట్టినప్పటి నుంచి మా పెళ్ళి స్థిరం అయిపోయింది. మా నాన్నగారికి యిష్టం లేకపోయినా మా అమ్మ పట్టుదల. నాకు యేమీ అభ్యంతరం కనిపించలేదు' అంది దమయంతి.

'నాన్నగారికి ఎందుకు అభ్యంతరం?'

'బావ సోమరితనం అంటే నాన్నగారికి చిన్నప్పటి నుంచి చిరాకే. జీవితంలో ఎలాంటి బరువులు, బాధ్యతలు ఎత్తుకోవటానికి అతను పనికిరాదు, తరువాత నీ యిష్టం - అని నాకు ఊహ తెలిసినప్పటి నుంచి నన్ను హెచ్చరిస్తూనే వున్నారు'

'అదా సంగతి' అంది సువర్చల.

ముందు హాలు, దానిలో వస్తువులు తీర్చిదిద్దినట్లు అనిపించకపోయినా, ఆ వస్తు సాంకల్యంలోనూ యేదో తీరు తెన్ను - పద్ధతి - వున్నదనిపించింది సువర్చలకు. బట్టలన్నీ ఒక మూల - పుస్తకాలన్నీ మరోమూల - వార్తాపత్రికల పర్వతం మరోకమూల - యిలా టీపాయ్‌లు, మోడాలు బరువులతో తులతూగుతున్నాయి.

వాళ్ళ భోజనం చివరిస్థాయిలో వున్నప్పుడు మళ్ళీ అశోక్ కూర్చున్నాడు. దమయంతి అతనికీ వడ్డించటం ప్రారంభించింది.

'నాకు రుచులు తెలియవు' అన్నాడు సువర్చల దమయంతి వంటకాలను

మెత్సుకుంటూ వున్నప్పుడు.

'అన్నీ చక్కగా చేసి పెట్టేవాళ్లుంటే, రుచులను గురించి పట్టించుకోవలసిన అవసరం మటుకేం వుంది?' అంది సువర్చల.

'భోజనం రుచికరంగా వుండాలా, పుష్టికరంగా వుండాలా అన్న విషయాన్ని గురించి నేను చాలా రోజులు ఆలోచించాను. ఆ విషయం మీదో పుస్తకం కూడా ప్రారంభమనుకుంటున్నాను, కాస్త తీరుబడి చూసుకుని.'

'తప్పకుండా రాయండి. మాబోటి మందభాగ్యులకు ఉపకరిస్తుంది. రుచులు చంపుకోలేక, పుష్టికరమైన ఆహారం యేదో తెలియక - మేం ఈ దేశంలో లక్షలాది ప్రజలం ఎంతో అస్తవ్యస్తమయిన స్థితిలో వున్నాం. నా మాట నమ్మండి' అంది సువర్చల.

దమయంతికి అశోక్ మాట్లాడుతున్న విషయం కొత్త. అతను అనేక పనులు చేస్తున్నట్లు చెప్పడం విన్నది గాని పుస్తకాలు రాయటాన్ని గురించి ప్రస్తావన యిదే మొదటిమారు.

సువర్చల అతన్ని 'సీరియస్'గా తీసుకోవడం లేదు గద, అని ఒక క్షణం పాటు భయపడిపోయింది దమయంతి. ఎందుకంటే, ఉన్నట్లుండి ఆమె ఓ ప్రశ్న వేసింది. ఇంతకూ భోజనం రుచికరంగా వుండాలా, పుష్టికరంగా వుండాలా - ఈ రెంటిలో మీ పరిశోధన ఫలితం ఎటువయిపు మొగ్గు చూపింది?' అని అడిగింది.

'ఏ ఒక్కటీ కాదు. రెండూను!' అన్నాడు అశోక్.

'నాకు అర్థం కాలేదు' అన్నది సువర్చల.

'మీకు అర్థం కాదు. ఎందుకు అర్థం కాదో కూడా నాకు స్పష్టంగా తెలుసు. చెబుతాను వినండి' అన్నాడు అశోక్.

దమయంతికి కూడా అతడేం చెబుతాడో విందాం అనే ఆసక్తి కలిగింది.

'మనస్సు వుంది చూచారూ - అది ఎప్పుడూ ద్వంద్వాలలో ఒక పక్షాన్నే పట్టుకు పాకులాడుతుంది. మంచి - చెడ్డ, కారం - పులుపు; వేడి - చలి.. యిలా ద్వంద్వాలు ఎన్నయినా వున్నాయి యీ ప్రపంచంలో'' - అశోక్ ఆగిపోయాడు.

అతను మళ్లీ వాక్యం ఆరంభించటానికి ఓ నిమిషం విరామం కావాల్సి వచ్చింది.

'మనిషి చేయవలసిన ప్రయత్నం యేమిటంటే - ఈ ద్వంద్వాలకు అతీతంగా ప్రవర్తించడం నేర్చుకోవాలి!'

'ఎలా సాధ్యం అవుతుంది? మనం వున్నదే ఎప్పుడూ ఈ డోలాయమానమైన స్థితిలో కదా!' అంది సువర్చల, అతనికి యేదో 'పాయింట్' అందిస్తే తప్ప చురుగ్గా ముందుకు వెళ్ళడని.

'ఈ ద్వంద్వాలపైన ఒకే ఒక 'ఏక'స్థితి వుంది. ఆ స్థితిలో ఈ రెండు రూపాలు సామరసంగా, అవిరళంగా కలిసిపోతాయి. అలా కలిసిపోయినట్లు మనకు తెలియకుండానే కలిసిపోతాయి. అదీ జీవిత సూత్రం. ఆ స్థితిని పట్టుకోవడానికి ప్రయత్నించాలి ప్రతి

మనిషిని. అప్పుడే జీవితం సారవంతంగా రసస్ఫూర్తితో విరాజిల్లుతుంది.'

అతను కావ్యభాష మాట్లాడుతున్నట్లు అనిపించింది సువర్చలకు. అయినా యిదేదో అర్థం చేసుకోవలసిందే.

అశోక్ మళ్ళీ మొదటికి వచ్చి, 'అందుచేత నేను అనేది యేమిటంటే భోజనంలో రుచి, పుష్టి విడదీయటానికి వీలులేనంతగా కలిసిపోవాలి. పుష్టికరమైన ఆహారం యిస్తున్నాం అని 'ఇన్‌సిపిడ్' పదార్థాలు వడ్డించకూడదు. అన్నిటినీ సమ్మిశ్రం చేయడంలోనే, ఒకటిగా చేసి చూడడంలోనే పచన కళ యావత్తూ యిమిడి వుంది' అన్నాడు.

ఈ విషయాన్ని కేవలం భోజనానికే పరిమితం చేయనవసరం లేదు. జీవితంలో యే సందర్భానికయినా అన్వయించే సూత్రం యిది.. అనిపించింది సువర్చలకు.

'నీ యింటికి భోజనానికి వచ్చానంటే - కేవలం తినడానికే కాదు గదా! మనిషి మనసుతీరా మాట్లాడుకోవడం కోసరమే భోజనం బల్ల దగ్గరకు స్నేహితులను ఆహ్వానిస్తాడు. ఈ అలవాటు, ఈ ధర్మ సూక్ష్మం మనకు మేనేజ్‌మెంట్ ప్రిన్సిపుల్స్‌లో చెప్పక చెప్పిన విషయం కదా!' అంది దమయంతితో.

'మీరు పుస్తకాలు రాస్తానంటే వాటిని ప్రచురించే మనిషిని చూచిపెడతాను - నేను' అంది అశోక్‌తో.

'ప్రతి మనిషికీ తెలియవలసినవీ, పుస్తకాలుగా రాస్తే పేలవం అయిపోయేవీ - అనేక వస్తువులు వున్నాయి. అందుకనే తటపటాయిస్తున్నాను' అన్నాడు అశోక్.

'మీ యిష్టం' అని మాత్రం అంది దమయంతి - భర్త సోమరితనం నుంచి ఎక్కడ విడిపడిపోతాడో అని భయపడుతున్నట్లుగా.

సువర్చల యింకేమీ పొడిగించలేదు.

ఆమె ఇంటికి వెళ్ళిపోవలసిన సమయం ఆసన్నమయింది. అప్పుడు మళ్ళీ బెడ్‌రూంలోంచి యివతలకు వచ్చాడు అశోక్.

'నేను రావడం మీ ఆలోచనలకు అంతరాయం కలిగించిందేమో నాకు తెలీదు. కొన్ని కొత్త ఆలోచనలు మటుకు దొరికాయి నాకు' అంది సువర్చల.

'ఆ సంగతి రేపు దమయంతితో డిస్కస్ చేయండి' అన్నాడు అశోక్.

మరునాడు రెస్టారెంట్‌లో కలిసి భోజనం చేస్తున్నప్పుడు సువర్చల మళ్ళీ అడిగింది.

'మీ వారికి స్థిరమైన ఉద్యోగం లేకపోవడం నీకెప్పుడూ యిబ్బంది అనిపించలేదా?'

'అశోక్‌కా? అతను ఉద్యోగం చేస్తానంటేనే నాకు యిబ్బంది. అతను నన్నేం డిక్టేట్ చేయడు. అందుకనే ఎలాంటి యిబ్బందీ లేకుండా కాలక్షేపం చేయగలుగుతున్నాం..'

'నీ దృష్టి నుంచి కూడా ఆలోచించి చూడు దమయంతీ.. అయినా లోతుగా.. 'డ్రోన్' అయిన మనిషితో కాపురం చేయటానికి ఎంతో ధైర్యం, సాహసం కావాలి' అంది సువర్చల.

'నేనెప్పుడూ యీ విషయాన్ని గురించి ఆలోచించి తల పాడుచేసుకోలేదు. అందుకనే

యిలా నిదానంగా వుండగలుగుతున్నా ననుకుంటాను. అయినా చూడు - వృత్తి, ఉద్యోగం పేరుతో నెలకు యిరవై రోజులు దేశాలు పట్టుకు తిరిగే భర్త ఒకవైపు. ఎప్పుడూ కళ్ల ఎదురుగా కనిపిస్తూ తన ఉనికిని యేమాత్రం 'యింప్రెస్' చేయటానికి ప్రయత్నించని భర్త మరొకవైపు. వీళ్ళిద్దరికీ త్రాసులో వేసి తేచు. మీ మనసు ఎటు మొగ్గుతుందో నాకు అయితే తెలియదు గాని నేను రెండో పక్షమే మందిదంటాను.'

'కాని - అశోక్ చెప్పినట్లుగా ఆ రెండు పక్షాలు కాకుండా మధ్యేమార్గంలో మరో అగ్రాసనం వుంది కదూ?'

'ఏమో నాకు తెలియదు. ఆ అగ్రాసనాన్నే మనం యేదో పక్షానికి చేర్చి నిందాస్తుతులతో తలమున్కలు అవుతున్నామేమో అనిపిస్తుంది నాకు. సరే.. ఆ విషయం అలా వుంచు. ఇంతకూ మీరు ఫ్లాట్ కొనడం యేమయింది?' అనడిగింది. దమయంతి విషయం మార్చాలని ప్రయత్నిస్తూ.

'నీకు చెప్పడం మరచాను. మావారు యేమన్నారో తెలుసా? ఫ్లాట్ కొనడం మంచిదా లేక ప్లాట్ కొని ఇల్లు కట్టుకోవడం మంచిదా అనే విషయం అశోక్‌తో ప్రస్తావిస్తే బాగుంటుందన్నారు. ఈ రెంటికీ అతను ఎలా ఇంటిగ్రేషన్ తెస్తాడో చూడాలి. తప్పకుండా అని పట్టుమీద ఉన్నారు' అంది సువర్చల.

'అప్పుడే యీ విషయం డైనింగ్ టేబుల్ ముందు ప్రస్తావనకు వచ్చిందన్నమాట!' అంది దమయంతి.

'ఉహూ. అర్థరాత్రి వచ్చారు ఆయన. అయినా ఆరు గంటలకే లేచి కూర్చుని ఏడున్నరకల్లా బ్రేక్‌ఫాస్ట్ కోసం తయారయ్యారు. అప్పుడు చెప్పాను మీ ఇంట్లో నిన్న జరిపిన కాలక్షేపం కబుర్లు. ఈమారు ఎలాగయినా సరే, దమయంతి అశోక్ మన యింటికి భోజనానికి కలిసి వచ్చేటట్లుగా చూడడం నా రెస్పాన్సిబిలిటీ అన్నారు ఆయన. మరి నా బాధ్యతను నువ్వు ఎలా పంచుకుంటావో నీ దయ. మాకు 'యిల్లు' యేర్పడడం యిప్పుడంతా నీ అనుగ్రహం మీదనే ఆధారపడి ఉంది' అంది సువర్చల.

ఆమె వేళాకోళంగా అంటుందో, చాలా సీరియస్‌గానే మాట్లాడుతోందో దమయంతి కయితే తెలియలేదు. కాకపోతే దీన్ని రెండు రకాలుగానూ తీసుకోవచ్చునన్న సంగతి యిప్పుడిప్పుడే కొత్తగా తెలిసి వస్తోంది.

'ఏమంటావ్? అశోక్‌ను తీసుకుని పై వారం మా యింటికి తప్పకుండా భోజనానికి రావాలి!' అంది దమయంతితో సువర్చల మళ్ళీ హెచ్చరిస్తున్నట్లుగా.

'అలాకాదు. మనం నలుగురం యింతవరకు కలిసి భోజనం చేయడమే కుదరలేదు. మా యింట్లోను - మీ యింట్లోను కూడా. అందుకని యేదో రెస్టారెంట్‌లో యథాలాపంగా కలుసుకున్నట్లు తటస్థిస్తే, నీ సమస్యకు - అనుమానాలకు పరిష్కారాలు త్వరగా దొరుకుతాయేమో అనిపిస్తుంది ఆనకు' అంది దమయంతి.

'అదీ నిజమేననుకో. అయినా భోజనం యింట్లో చేయడం మంచిదా.. రెస్టారెంట్‌కు వెళ్ళడం మంచిదా?.. ఈ రెంటినీ అశోక్ ఎలా ఇంటిగ్రేట్ చేస్తాడో చూడాలని వుంది' అంది సువర్చల.

'అదేం బ్రహ్మవిద్య కాదు. రెస్టారెంట్ నుంచి పదార్థాలన్నీ తెప్పించుకుని వాటికి ఇంప్రోవైజ్‌డ్ ఎడిషన్స్ తయారుచేసి తినడమే మధ్యేమార్గం' అంది దమయంతి అతి సీరియస్‌గా.

మనం వెదుకుతున్నది ఆ మార్గమేగా! 'ది ఎలెవెన్ కాజెస్ ఫర్ ది డిజనరేషన్ ఆఫ్ ఇండియా'ను గురించి తలబద్దలు కొట్టుకోవడం లేదుగదా. అలాగే ఏదన్నా మంచి రెస్టారెంట్‌లోనే కలుసుకుందాంలే. అందుకు తగిన వ్యూహం పన్ను. లెటజ్ విష్ అవర్ సెల్వ్స్ ఆల్ ది బెస్ట్' అంది సువర్చల. గడియారం చూచుకుంటూ బల్ల ముందు నుంచి పైకి లేస్తూ.

రచన-ఫిబ్రవరి, *2008*

◆